క్లుప్తంగా

ఉసేన్‌స్వామి దర్గాకు పోటెత్తిన భక్తులు



ఉసేన్‌స్వామికి ఫాతెహాలు సమర్పిస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరులో వెలసిన ఉసేన్‌స్వామి దర్గాకు గురువారం భక్తులు పోటెత్తారు. జిల్లాతోపాటు కర్నూలు, వైఎస్సార్, అనంతపురం జిల్లాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో చేరుకోవడంతో దర్గా కిటకిటలాడింది. జెండాలు, పూలదట్టీలను ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామివారికి సమర్పించారు. ఫాతెహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ముస్లిం పెద్దలతో ఎస్‌ఐ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ కిరణ్ బాబు

అవుకు: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉన్న ముస్లిం పెద్దలతో గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ కిరణ్ బాబు సమావేశమయ్యారు. 17న బక్రీద్ పండుగ జరుగనున్న నేపథ్యంలో వారికి ఎస్‌ఐ సూచనలు చేశారు. పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని తెలిపారు.

ఐఎఫ్‌టీయూ నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులతో రంగనాయకులు

డోన్ టౌన్ : ఐఎఫ్‌టీయూ డోన్ పట్టణ నూతన కమిటీని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ సంఘం జిల్లా కార్యదర్శి రంగనాయకులు ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో గురువారం కమిటీ సమావేశం జరిగింది. అధ్యక్షునిగా బోయ రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా బోయ చందు, ఉపాధ్యక్షుడు లక్ష్మన్నతోపాటు మరో పదిమంది సభ్యులను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రూరల్ కమిటీ కార్యదర్శి బందెనవాజ్ వలి, డివిజన్ నాయకులు మునీంద్ర, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

కోవెలకుంట్ల: స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించ తలపెట్టినట్లు డిపో మేనేజర్ తిరుపతయ్య తెలిపారు. డిపో పరిధిలోని రూట్లలో తిరిగే బస్సు సర్వీసులపై సూచనలు, సలహాలు, ఫిర్యాదులు అందజేయాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. 9959225798 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయాలని సూచించారు.

రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ పదవికి రాజీనామా

బేతంచెర్ల: రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ పదవికి బేతంచెర్ల పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు ముర్తుజావలి గురువారం రాజీనామా చేశారు. ఈయన 2023 జూన్‌లో రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం మారడంతో తన పదవికి రాజీనామా చేసినట్లు ముర్తుజావలి తెలిపారు.

సబ్సిడీ విత్తనాల కోసం ఆర్బీకేలో దరఖాస్తు చేసుకోండి

బేతంచెర్ల: రైతులు సబ్సిడీ విత్తనాల కోసం ఆర్బీకేల్లో దరఖాస్తు చేసుకోవాలని ఏఓ కిరన్ కుమార్ గురువారం తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురిశాయని, వేరుశనగ, కందులు, కొర్రల సాగుకు అనుకూలమన్నారు. వేరుశనగ 40 శాతం, కందులు 30 శాతం, కొర్రలు 50 శాతం సబ్సిడీతో అందుబాటులో ఉన్నాయని వివరించారు.

బండలాగుడు విజేత గుడిపాడు ఎద్దులు

చాగలమర్రి: స్థానిక చెరువ కట్టపై వెలసిన దస్తగిరి స్వామి ఉరుసు సందర్భంగా గురువారం నిర్వహించిన సేద్యపు ఎద్దుల రాతి దూలం లాగుడు పోటీల్లో వైఎస్సార్ జిల్లా, దువ్వూరు మండలం, గుడిపాడు గ్రామానికి చెందిన నారాయణరెడ్డి ఎద్దులు ప్రథమ స్థానంలో నిలిచి రూ.40వేల నగదు బహుమతిని గెలుపొందాయి. పోటీల్లో మొత్తం 16 జతల ఎద్దులు పాల్గొన్నాయి. ఆ తరువాతి స్థానాల్లో నిలిచిన ఎద్దులను దర్గా కమిటీ సభ్యులు ప్రకటించారు. వరుసగా..ప్రొద్దుటూరు, చెన్నూరు మండలం ఓబులంపల్లి, ప్రొద్దుటూరు, యర్రగుంట్ల, పోతిరెడ్డిపల్లి, చెరువుకిందపల్లి గ్రామాలకు చెందిన ఎద్దుల యజమానులకు దాతల సహకారంతో రూ.30 వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేలు, 2వేల నగదు అందజేశారు. పోటీలను తిలకించేందుకు రైతులు తరలి వచ్చారు.



అంకిరెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలలో పిల్లలను చేర్పించిన తల్లితండ్రులు



బేతంచెర్ల ఎంపీయూపీ మెయిన్ స్కూల్‌లో విద్యార్థుల సందడి

బడిబాటలో హుషారు

- తొలి రోజు విద్యార్థుల హాజరు అంతంతే

కొలిమిగుండ్ల: బడిగంట మోగింది. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. ఇన్ని రోజులు ఆటపాటలతో గడిపిన విద్యార్థులు బడిబాట పట్టారు. తొలి రోజు పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం తక్కువగా కనిపించింది. గ్రామీణ ప్రాంతాల నుంచి మండల కేంద్రం కొలిమిగుండ్లలోని ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, అంకిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాలల విద్యార్థులకు బస్ పాస్ సౌకర్యం లేక పోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. అదేవిధంగా విద్యార్థి బస్ అందుబాటులో లేక విద్యార్థులు పాఠశాలలకు హాజరు కాలేకపోయారు. కొలిమిగుండ్లలోని బీసీ ప్రాథమిక పాఠశాలకు పదిలోపు విద్యార్థులు హాజరయ్యారు. మొదటి రోజు తొమ్మిది గంటలు దాటినా ఒక్క విద్యార్థి పాఠశాలకు రాలేదు. కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించారు.



కొలిమిగుండ్ల మోడల్ స్కూల్‌లో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

బేతంచెర్ల: మండల కేంద్రం బేతంచెర్లతోపాటు గ్రామాల్లోనూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు గురువారం తెరుచుకున్నాయి. దీంతో పాఠశాలలు విద్యార్థులతో కళకళలాడాయి. తమ పిల్లలను తల్లితండ్రులు తోడుగా వచ్చి బడిలో వదిలి వెళ్లారు. ఎంఈఓ కార్యాలయం నుంచి ఆయా పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను హెచ్ఎంలకు అందజేశారు.



పాఠ్య పుస్తకాలను పాఠశాలలకు తరలిస్తున్న సీఆర్ఎంటీలు

బనగానపల్లె రూరల్ : ప్రభుత్వ పాఠశాలలు గురువారం పున: ప్రారంభమయ్యాయి. వేసవి సెలవులను సరదగా గడిపిన విద్యార్థులు బడిగంటలు మోగడంతో బడిబాట పట్టారు. మొదటి రోజు చాలా పాఠశాలల్లో తక్కువ శాతం విద్యార్థులు హాజరయ్యారు. పాఠ్య, నోటు పుస్తకాలను ఆయా పాఠశాలల హెచ్ఎంలకు సీఆర్ఎంటీలు అందజేశారు. మండలంలో 54 శాతం విద్యార్థులు తరగతులకు హాజరైనట్లు ఎంఈఓ స్వరూప తెలిపారు.

పాఠశాలలు పునఃప్రారంభం



బాలికల పాఠశాలలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

డోన్ టౌన్ : మండల కేంద్రం డోన్‌తోపాటు గ్రామాల్లో గురువారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయి. పట్టణంలోని పాతపేట జెడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, కొత్తపేటలోని జెడ్పీ హైస్కూల్(లోకల్ ఫండ్)గర్ల్స్ హైస్కూల్, నెహ్రూనగర్, వైయస్ నగర్, జాడీల ఫ్యాక్టరీ, తారకరామనగర్‌లోని పాఠశాలలు విద్యార్థులతో కళకళలాడాయి. మండల కేంద్రం నుంచి ఆయా పాఠశాలలకు స్టూడెంట్స్ కిట్స్ తరలించి వాటిని విద్యార్థులకు అందించే పనిలో ఉపాధ్యాయులు నిమగ్నమయ్యారు. అదేవిధంగా ఆయా పాఠశాలల్లో తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించారు.

విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ అందజేత

సంజామల: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో గురువారం పాఠశాలలు పనఃప్రారంభమయ్యాయి. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికి స్టూడెంట్ కిట్‌ను అందజేశామని ఎంఈఓ 2 ఈశ్వరయ్య తెలిపారు.

క్యాన్సర్ నిర్మూలనపై అవగాహన కల్పించాలి





కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటరమణ, హాజరైన వైద్యులు

బనగానపల్లె రూరల్ : క్యాన్సర్ నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యశాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ రామనాథ్‌రావు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఏరియా కమ్యూనిటీ వైద్యశాలలో గురువారం నిర్వహించిన క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. క్యాన్సర్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వహించే వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మహిళలలో ఈ వ్యాధి ఎక్కువగా వచ్చే ప్రమాదం ఉందని, పొగాకు గుట్కా, ఖైనీ వంటి మత్తు పదార్థల వినియోగం ప్రమాదాన్ని వివరించాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ వెంకటరమణ క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో స్థానిక ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ పద్మజ, పలుకూరు, టంగుటూరు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మధు మౌనిక, వైద్యులు డాక్టర్ శివశంకరుడు, నొస్సం, బేతంచర్ల, అవుకు, కొలిమిగుండ్ల సంజామల, కోవెలకుంట్ల మండలాల్లోని పీహెచ్‌సీ వైద్యులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అలరించిన భజన కార్యక్రమం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద నంద్యాలకు చెందిన సీతారామాంజనేయస్వామి భజన మండలి వారిచే భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమములో వినాయకస్తుతి, లింగాష్టకం, శ్రీశైలవాసా శ్రీమల్లికార్జున, శైలం శివమయం, కరుణించరా శంకరా, శివశివశంకరా, శంభో శంభో తదితర భక్తిగీతాలు, అష్టకాలను మండ్ల రాము, దివాకర్ రెడ్డి, వెంకటరమణ, బాబు, వెంకటస్వామి, పాపయ్య, మద్దయ్య, పవన్, శేఖర్, పుల్లయ్య, మధు, హరి, జనార్దన్‌రెడ్డి, మహేష్, వెంకటరమణ, శేఖర్ నాయుడు, కార్తిక్, మద్దిలేటి తదితరులు ఆలపించారు.

దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు

శ్రీశైలం టెంపుల్: లోకకల్యాణం కోసం దేవస్థానం గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం కింద వెలసిన దత్తాత్రేయస్వామివారికి విశేష పూజలను నిర్వహించింది. పూజాకార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజను జరిపించారు. తరువాత దత్తాత్రేయ స్వామివారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం

డోన్ టౌన్ : వ్యక్తిగత, పరిసరాల శుభ్రతతో అంటూ వ్యాధులు దూరం అవుతాయని, ఆరోగ్యంగా ఉంటామని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరామ్ అన్నారు. గురువారం పట్టణంలోని 9వ వార్డులో ఆయన పర్యటించారు. కాలనీలో దోమల నివారణకు, మురికి కాల్వలలో లార్వా వ్యాప్తి చెందకుండా కార్మికులు చేపట్టిన పిచికారీ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం వార్డులో కలియ తిరుగుతూ ప్రజలు ఇంటి ముంగిట నీటి తొట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నీటిని రోజుల తరబడి నిల్వ ఉంచుకూడదన్నారు. పాత టైర్లు, కొబ్బరి బొండాల పరిసరాల్లో ఉంచుకుంటే వాటిలో వర్షం నీరు చేరి దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. ఈయన వెంట మున్సిపల్ ఇంజినీర్ సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహ్మద్‌బాషా, సచివాలయం సిబ్బంది ఉన్నారు.



మురుగు కాల్వలో ద్రావణం పిచికారీని పరిశీలిస్తున్న కమిషనర్ జయరామ్

వేగవంతంగా బీసీజీ టీకాలు



వృద్ధురాలికి బీసీజీ టీకాలు వేస్తున్న దృశ్యం



బీసీజీ టీకా వేస్తున్న వైద్యులు

కోవెలకుంట్ల: టీబీ సోకకుండా అరవైఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ బీసీజీ టీకా వేసే ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతున్నట్లు డాక్టర్లు విద్యాసాగర్, మహబూబ్‌సుభాని అన్నారు. గురువారం కోవెలకుంట్ల మండలంలోని రేవనూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వృద్ధులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధులతోపాటు బీపీ, షుగర్ తదితర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి టీకాలు వేస్తున్నామన్నారు. ఆయా కేటగిరిలకు చెందిన వ్యక్తులు టీకాలు వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ ప్రభావతి, వైద్య సిబ్బంది,ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలి

బేతంచెర్ల: భవిష్యత్తులో టీబీ రాకుండా బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలని వైద్యులు తస్లీమా, ప్రియాంక అన్నారు. పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ప్రజలకు బీసీజీ వ్యాక్సిన్ వేశారు. వారు మాట్లాడుతూ ప్రతి గురువారం బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. పట్టణ ప్రజలు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకొని మీ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు.

బీసీజీ టీకాతో క్షయ వ్యాధి నిర్మూలన

ప్యాపిలి: క్షయ వ్యాధిని సమూలంగా నిర్మూలించాలన్న ఉద్దేశంతో 18 సంవత్సరాలు పైబడిన అందరికీ బీసీజీ టీకాలు వేస్తున్నట్లు వైద్యాధికారులు వాణిశ్రీ, నితీష్ తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలోని 12 సచివాలయాల్లో గురువారం 193 మందికి బీసీజీ టీకా వేసినట్లు వారు తెలిపారు. ప్రతి గురువారం సచివాలయాల్లో బీసీజీ టీకా వేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వచ్చే మూడు నెలల్లో వంద శాతం అందరికీ టీకా వేయడమే లక్ష్యంగా ఉంచుకున్నట్లు తెలిపారు.

అడిగేదెవరు?

- రోడ్డు నిబంధనలు పట్టించుకోని వాహనచోదకులు
- యవత స్పీడ్‌కు బ్రేకుల్లేని వైనం
- మైనర్లు సైతం ఇష్టారాజ్యంగా డ్రైవింగ్
- పట్టించుకోని అధికారులు

డోన్ : అడిగేదెవరు అన్నట్లుగా ఉంది డోన్ పట్టణంలో వాహనచోదకుల తీరు. ఏ మాత్రం డ్రైవింగ్ నిబంధనలు పట్టించుకోకుండా యవుత ఇష్టారాజ్యంగా డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. మితిమీరిన వేగంతో రయ్... రయ్ అంటూ దూసుకెళ్తున్న తీరుతో బాటసారులే కాదు ఇతర వాహనదారులు సైతం భయభ్రాంతులకు గురవుతున్నారు. మైనర్లు సైతం తమకు తోచిన విధంగా డ్రైవింగ్ చేస్తున్నారు. బైక్‌పై ఇద్దరు, ముగ్గురు వెళ్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. పిల్లల తీరును ప్రశ్నించాల్సిన తల్లిదండ్రులు సైతం నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. చిన్నచిన్న పనులు అలా వెళ్లి... ఇలా చేస్తారనే భావనతో ఖరీదైన వాహనాలను కొనిపెడుతున్నారు కూడా. అయితే డ్రైవింగ్ శిక్షణ ఓ పద్ధతి ప్రకారం ఇప్పించాలనే విషయాన్ని మరిచిపోతున్నారు. బైక్ నడుపుతున్నారనే భావన తప్పా... డ్రైవింగ్ నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే విషయాన్ని విస్మరిస్తున్నారు తల్లిదండ్రులు. దీంతో తమకు అంతా తెలుసనే ఉద్దేశంతో మితిమీరిన వేగంతో వెళ్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు యువతతోపాటు మైనర్లు. అనుకోని సంఘటనలు జరిగినప్పుడు ఏడవడం తప్పా ముందుజాగ్రత్తలు పాటించడం లేదని అధికారులు సైతం అసహనం వ్యక్తం చేస్తున్నారు. తల్లిదండ్రులు, వ్యాపారులు, వర్క్‌షాప్ నిర్వాహకులు సైతం వివిధ పనుల నిమిత్తం మైనర్లకు బైక్‌లు ఇవ్వడం మూలంగా ప్రమాదాలకు గురతూనే ఉన్నారు. ఇటీవల పట్టణంలోని శ్రీరాంనగర్‌కు చెందిన 15 ఏళ్ల యువకుడు ఫ్లైఓవర్‌పై అత్యంత వేగంతో బైక్ నడుపుతూ డివైడర్‌ను ఢీకొనడంతో ప్రాణాలు పోగొట్టుకున్నాడు. తమకు ఉన్న ఒక్కగానొక్క కొడుకు మత్యువాత పడడంతో ఆ తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం. ఇలాంటి సంఘటనలు ప్రతియేటా జరుగుతూనే ఉన్నాయి.



స్కూటీపై ముగ్గురు మైనర్ బాలికలు (ఫైల్)

“మైనర్లు డ్రైవింగ్ చేస్తే రూ.25వేల జరిమానా



రోడ్డు ప్రమాదాలు నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత. డ్రైవింగ్ నిబంధనలు పాటించేలా కుటుంబ సభ్యులే తమ పిల్లలకు సూచించాల్సిన అవసరం ఉంది. కొత్త ట్రాఫిక్ నిబంధనలు చాలా కఠినంగా ఉన్నాయి. మైనర్లు వాహనాలు డ్రైవ్ చేస్తూ పట్టుపడితే రూ.25వేల వరకు జరిమానా విధిస్తాం. ఓవర్‌స్పీడ్, లైసెన్స్ లేకపోయినా రూ.500 నుండి రూ.2వేల వరకు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ప్రతిఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాల కట్టడికి సహకరించాలి. – క్రాంతికుమార్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, డోన్.



ట్రిబుల్ డ్రైవింగ్ చేస్తున్న మైనర్ బాలిక



స్కూటీపై వెళ్తున్న మైనర్ బాలుడు



ట్రిబుల్ డ్రైవింగ్ చేస్తున్న మైనర్లు

వివాహానికి చేయూత

బేతంచెర్ల: పట్టణంలో ఓ నిరుపేద కుటుంబంలో జరుగుతున్న వివాహానికి బేతంచెర్ల ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందజేసి చేయూతనిచ్చారు. కమిటీ తరఫున పెళ్లికి సంబంధించిన సరుకులను అందజేసినట్లు సభ్యులు సుభాన్, వలీ, సలాం తెలిపారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

డోన్ రూరల్: స్థానిక రైల్వే స్టేషన్ ఒకటవ ప్లాట్‌ఫారంపై గురువారం కర్నూలు జిల్లా తడకనపల్లెకు చెందిన కదిరి సోమన్న (44) అనారోగ్యంతో మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. కొన్నేళ్ల నుంచి మృతునికి బీపీ, షుగర్ వ్యాధులు ఉండటంతో బయటే తిరుగుతున్నట్లు మృతుడి బంధువులు తెలిపారన్నారు. ఆధార్ కార్డు వివరాల మేరకు కుటుంబ సభ్యులను పిలిపించి మృతదేహాన్ని వారికి అప్పగించిటన్లు పోలీసులు తెలిపారు.

18నుంచి డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

నంద్యాల(న్యూటౌన్): 2024–25 విద్యాసంవత్సరానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి అడ్మిషన్లు ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని స్థానిక ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ గురువారం తెలిపారు. ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థులు డిగ్రీలో చేరేందుకు అడ్మిషన్లు పొందాలన్నారు. ఈ విద్యాసంవత్సరంలో 8 సింగిల్ మేజర్ ప్రోగ్రామ్స్‌లో విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. బీఏ, ఎకనామిక్స్, బీఏ పొలిటికల్ సైన్స్, బీకాం జనరల్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ మేథమేటిక్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ జువాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఆయా కోర్సులకు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజును మాత్రమే వసూలు చేస్తామన్నారు. డిజిటల్ క్లాస్ రూమ్స్, ల్యాబ్స్, లైబ్రరీ, నూతన కంప్యూటర్ ల్యాబ్ తదితర సౌకర్యాలన్నీ కళాశాలలో ఉన్నాయని చెప్పారు. అర్హులైన విద్యార్థులకు ప్రభుత్వ స్కాలర్ షిప్‌లు అందజేస్తామన్నారు. కాలేజీలో చేరే విద్యార్థులు రెండు ఫొటోలు, ఆధార్‌కార్డు, ఇంటర్మీడియెట్ మార్క్‌లిస్ట్, టీసీ, స్టడీ, పదవ తరగతి మార్కుల లిస్ట్, ఒరిజినల్ కాపీలతో రావాలని సూచించారు.

నిలిచిన సచివాలయ సేవలు

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల సచివాలయంలో ప్రజా సేవలు నిలిచిపోయాయి. ఏడెనిమిది రోజులుగా కురుస్తున్న వర్షాలకు సచివాలయం (అద్దె భవనం) జలమయం అయ్యింది. దీంతో పక్కనే ఉన్న నూతన సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు ఉద్యోగులు. అయితే నూతన భవనానికి ఇంకా విద్యుత్ కనెక్షన్ పూర్తి కాలేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో విత్తనాలు తదితరాల వ్యవసాయానికి సంబంధించి రైతులు వివరాలు సచివాలంలో పొందాల్సింది. అయితే కరెంటు సరఫరా లేదని సచివాలయ ఉద్యోగులు సమాధానం చెబుతుండడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. సమీప గ్రామాలైన ముక్కమల్ల, ముదిగేడు గ్రామాల సచివాలయాలకు వెళ్లి రైతులు సంబంధిత సేవలు పొందుతున్నారు. అధికారులు స్పందించి త్వరగా సచివాలయ సేవలు పునఃప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కొరత లేకుండా ఎరువులు సరఫరా చేయాలి

నంద్యాల(సెంట్రల్): జిల్లాలోని హోల్‌సేల్ ఎరువుల దుకాణాదారులు రిటైల్ డీలర్లకు, రైతులకు ఎరువుల కొరత లేకుండా సక్రమంగా సరఫరా చేయాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి వై.మురళీకృష్ణ ఆదేశించారు. గురువారం ఆయన సహాయ వ్యవసాయ సంచాలకులు రాజశేఖర్, నంద్యాల మండల ఏఓ ప్రసాదరావుతో కలిసి పట్టణంలోని హోల్‌సేల్ ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెంకట శివసాయి ఫర్టిలైజర్స్ దుకాణంలో ఎరువుల నిల్వలు, స్టాక్ బుక్ రిజిస్టర్స్, బిల్ పుస్తకాలు, ఇతర ధ్రువపత్రాలు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ...ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు ఎరువులను విక్రయించరాదని, రైతులకు కావాల్సిన ఉత్పత్తులను మాత్రమే అమ్మాలని సూచించారు. రిజిస్టర్, గ్రౌండ్ బ్యాలెన్స్ సమానంగా ఉండేటట్లు చూసుకోవాలని చెప్పారు.



వెంకటశివ సాయి ఎరువుల దుకాణంలో తనిఖీ నిర్వహిస్తున్న డీఏవో మురళీకృష్ణ బృందం

భక్తిశ్రద్ధలతో ఆంథోని జయంతి

నంద్యాల(అర్బన్): పునీత్ ఆంథోనిని ప్రార్థిస్తే అద్భుతాలు జరుగుతాయని కర్నూలు మేత్రాసన పీఠాధిపతి గోరంట్ల జ్వాన్నేస్ తెలిపారు. మండలంలోని చాపిరేవుల గ్రామంలో వెలసిన పునీత్ ఆంథోని పుణ్యక్షేత్రంలో గురువారం ఆంథోని జయంతి వేడుకల్లో కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల క్రైస్తవులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఫాదర్ మర్రెడ్డి, గురువులు ఫాదర్ కిశోర్, ఏసుపాదం, కేథలిక్ గురువులు పాల్గొన్నారు.

వేలాలతో మహానందీశ్వర స్వామికి భారీ ఆదాయం

మహానంది: మహానంది దేవస్థానంలోని పోచా బ్రహ్మానందరెడ్డి విశ్రాంతి భవనంలో గురువారం వివిధ అంశాలకు నిర్వహించిన బహిరంగ వేలాల ద్వారా మహానందీశ్వర స్వామికి భారీ ఆదాయం సమకూరింది. ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేలాలు నిర్వహించారు. దేవస్థానానికి చెందిన భూముల ద్వారా ఏడాదికి రూ.14, 32,900 ఆదాయం వచ్చింది. కరివేన బ్రాహ్మణ అన్న సత్రం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న అన్నపూర్ణ హోటల్ బాడుగ నెలకు రూ.1,96,170 ఉండగా రూ.2,01,500 చొప్పున గంగిశెట్టి రమణమ్మ దక్కించుకున్నారు. ఆలయంలో ఉన్న అల్యూమినియం పాత్రలను విక్రయించేందుకు కిలో రూ.145 ప్రకారం నంద్యాలకు చెందిన చిన్న ఉసేని హక్కు పొందారు. జేఎస్‌డబ్ల్యూ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్ల నిర్వహణకు మహానందికి చెందిన స్వప్నకుమారి ఏడాదికి రూ.4,50,000తో దక్కించుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓలు మధు, ఓంకారం వేంకటేశ్వరుడు, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.